GHMC
hmda
Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్®
THE
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శనివారం 07-11-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

బంగారం తాకట్టు పెట్టినా రైతులకు దక్కని పంటల ఫలితం

ం నర్సాపూర్ నియోజకవర్గంలో ఎండిన పంటలను పరిశీలించిన హరీశ్‌రావు
ం నీరు లేక 12 ఎకరాల వరి పంట ఎండిపోయింది!
ం రుణమాఫీ కాలేదు.. కొత్త పంట రుణం అందలేదు
ం అప్పులు చేసి సాగు చేసినా రైతుకు మిగిలింది నష్టమే
ం తక్షణమే పంట నష్టపరిహారం అందించాలని ప్రభుత్వానికి డిమాండ్

8లో





4లో

విచారంలో విచారణ నివేదిక.. నాలుక గీసుకునే పరిస్థితి కరువు..!

- అండగా ముగ్గురు నేతలు.. సస్పెండ్ నిలిపివేత..!
- విచారణ జరగకుండా ఆపేది మీరే, విచారణ పూర్తయిన నివేదికపై చర్యలు నిలిపేది తమరే.!
- ఖుధాబక్షుపల్లి, లెంకలపల్లి గ్రామాల విచారణ నివేదిక బూడిదపాలేనా!
- ఉన్నత అధికారులు ఎందుకు ఆ నివేదికలపై చర్యలు తీసుకోవడం లేదు!
- ఏడు ఏండ్ల నుండి ఒకే మండలంలో కొలువు.. బదిలీ మరిచిపోయారా, లేక మరిపిస్తున్నారా..!
- డీపీవో విచారణలో తమరికేం పని.. అధికారివా, సర్పంచ్ వా, లేక స్వచ్ఛంద సంస్థ ప్రతినిధివా..!
- బహిరంగగా ప్రెస్ మీట్.. సెక్రటరీలకు నిబంధనలు వర్తించవా.. మూకుమడి సెలవులు కోరడం మీ ఇష్టమేనా..!



దాడి కేసులో నిందితుడికి ఏడాది కఠిన కారాగార శిక్ష

ం కర్రతో దాడి చేసి గాయపరిచిన కేసులో శిక్ష
ం ఐపీసీ, ఎస్సీ ఎస్టీ చట్టాల కింద న్యాయస్థానం తీర్పు
ం రూ.1,000 జరిమానా.. చెల్లించకపోతే అదనపు జైలు శిక్ష
ం తండ్రి హత్య కేసులో ఇప్పటికే యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న నిందితుడు
ం పోలీసుల దర్యాప్తును అభినందించిన ఎస్పీ పరితోష్ పంకజ్
ం తండ్రి హత్య కేసులో ఇప్పటికే యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న నిందితుడు



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 06:

వ్యక్తిపై కర్రతో దాడి చేసి గాయపరిచిన కేసులో నిందితుడికి సంగారెడ్డి ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం ఏడాది కఠిన కారాగార శిక్ష విధించింది. కొండాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో నమోదైన ఈ కేసులో నేరం రుజువు కావడంతో న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది.

మిగతా 8లో

లెర్నింగ్ లైసెన్స్.. ఇక ఇంటి నుంచే!



ఇకపై లైసెన్స్ పొందాలంటే క్లచ్, యాక్సిలేటర్, స్టీరింగ్‌పై పట్టుసాధించడం ఎంత ముఖ్యమో.. రోడ్డు నిబంధనలపై అవగాహన పొందడం కూడా అంతే ముఖ్యంగా మారింది. ఎందుకంటే ఇప్పటి వరకు లెర్నింగ్ లైసెన్స్ పొందిన వెంటనే శాశ్వత లైసెన్స్ పరీక్షకు హాజరయ్యే విధానం ఉండేది. అయితే ఈ మధ్యలో మరో పరీక్ష కూడా ఉండబోతుంది. అదే రోడ్డు నిబంధనలపై వీడియోలు వీక్షించడం. న్యూయార్క్‌లో అమలులో ఉన్న ఈ వీడియో పరీక్ష విధానాన్ని తెలంగాణ రవాణా శాఖ అమలు చేస్తున్నది. రోడ్డు భద్రత వీడియోలు వీక్షించి అందులో ఉత్తీర్ణత సాధిస్తేనే శాశ్వత లైసెన్స్ స్లాట్ బుక్ అవుతుంది. ఒకవేళ విఫలమైతే మళ్లీ ఆ వీడియోలు వీక్షించాల్సిందే. అయితే ఈ మొత్తం లెర్నింగ్ ప్రకియ ఇంటి నుంచే పొందేల రవాణా శాఖ ఆన్‌లైన్ సేవలను తీసుకొచ్చింది. అయితే ఈ విధానం దరఖాస్తుదారులకు కొంత కఠిన పరీక్షనే పెట్టబోతుంది. శాశ్వత లైసెన్స్ పొందడానికి ముందర అంటే ఎల్ఎల్ఆర్ పొందడం, ఆ తర్వాత రోడ్డు నిబంధనల కోర్సు వీక్షించడం, వాటికి సంబంధించిన పరీక్ష రాయడం ఇలాంటి ప్రక్రియలు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు స్లాట్ బుక్ చేస్కొని సంబంధిత ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లి అక్కడ ఫొటో దిగి, ఆన్‌లైన్ పరీక్ష అధికారుల పర్యవేక్షణలో రాయాల్సి వచ్చేది. అందులో ఓకే అయితే అప్పటికప్పుడు లెర్నింగ్ లైసెన్స్ అందించేవారు. ఆ తర్వాత నెల రోజుల అనంతరం 6 నెలలలోపు డ్రైవింగ్ టెస్ట్‌కు హాజరై శాశ్వత లైసెన్స్ పొందేవాళ్లు. అయితే ఇప్పుడు లెర్నింగ్ లైసెన్స్ ఆన్‌లైన్‌లోకి వచ్చేసింది. అందుకు సంబంధించి కూకట్‌పల్లిని పైలెట్ ప్రాజెక్ట్‌గా అమలు చేసి ఆర్టీఏ అధ్యయనం చేసింది. దీని ప్రకారం దరఖాస్తుదారులు రోడ్డు భద్రతకు సంబంధించిన 64 నిబంధనల్ని తెలుసుకోవాలి. వీటిపై 120 వీడియోలను చూడాల్సి ఉంటుంది. ఒక్కోటి 20 నిమిషాల చొప్పున ఆరు మాడ్యుళ్లు ఉంటాయి. సుమారు రెండున్నర గంటల వీడియోగా ఉంటుంది. తమకు నచ్చిన సమయంలో కోర్సును వీక్షించొచ్చు. కోర్సు పూర్తయ్యాకే డ్రైవింగ్ పరీక్షకు స్లాట్ బుకింగ్‌కు అనుమతిస్తారు. కాగా, కూకట్‌పల్లి పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతమైందని అధికారులు తెలిపారు. మరో వారం రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కార్యాలయాల్లో ఈ విధానం అమల్లోకి రానుందని పేర్కొన్నారు. కాగా, కూకట్ పల్లి ఆర్టీఓ పరిధిలో ప్రారంభించిన ఈ పైలట్ ప్రాజెక్ట్‌లో ఇప్పటివరకు 2,155 మంది నమోదు చేసుకోగా, వారిలో 1968 మంది కోర్సును విజయవంతంగా పూర్తి చేశారు.

భూములు అమ్ముకుంటున్న కాంగ్రెస్



కూకట్‌పల్లిలో బీఆర్ఎస్ పాలనలో రెండువేల కోట్ల విలువైన స్థలాలను ప్రజా ప్రయోజనాల కోసం కేటాయిస్తే.. కాంగ్రెస్ మూడేండ్ల పాలనలో రెండువేల కోట్ల విలువైన భూములను అమ్ముకున్నదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీలో ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాన్ని అమ్మకానికి పెట్టడం సిగ్గుచేటన్నారు. కూకట్‌పల్లిలో హెచ్ఎండీఏ స్థలాన్ని, కేపీహెచ్‌బీ కాలనీలో హౌసింగ్ బోర్డ్ స్థలాలను వేలానికి పెట్టడాన్ని నిరసిస్తూ.. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..బీఆర్ఎస్ పాలనలో కేపీహెచ్‌బీ కాలనీలో సుమారు 50 ఎకరాల హౌసింగ్ బోర్డు స్థలాలను ప్రజలకు అంకితం చేసి, మహిళా, చిన్నారుల పార్కులు, క్రీడా ప్రాంగణాలు, ఇండోర్‌స్టేడియాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 6: నాడు కూకట్‌పల్లిలో నెక్సెస్ మాల్ వెనుకాల 20 ఎకరాల స్థలాన్ని మేము కాపాడితే.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆ స్థలంలో ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన చేసిందన్నారు. కాంగ్రెస్ పాలనలో హౌసింగ్ బోర్డులో 4,5 గజాల స్థలాలను కూడా వదలకుండా అమ్ముకుంటున్నారన్నారు. కేపీహెచ్‌బీ కాలనీలో ఫైర్ స్టేషన్ కోసం కేటాయించిన స్థలాన్ని విక్రయించారని, తాజాగా పెట్రోల్ బంక్‌కోసం వదలిన స్థలాన్ని వేలానికి పెట్టినట్లు చెప్పారు. ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాలను విక్రయిస్తే.. భవిష్యత్ తరాలకు కావాల్సిన మౌలిక వసతులను ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద కాలనీగా గుర్తింపు పొందిన కేపీహెచ్‌బీ కాలనీలో పెట్రోల్ బంక్, ఫైర్‌స్టేషన్‌లు లేవని, వాటికి కేటాయించిన స్థలాలను అమ్మితే ఎలా అని ప్రశ్నించారు. కేపీహెచ్‌బీ కాలనీలో హెచ్ఎండీఏ అనుమతులు లేకుండా స్థలాలను అమ్మడం సరికాదని, కొనుగోలు చేసిన వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, హౌసింగ్ బోర్డు వీసీ గౌతమ్‌లు తీరు మార్చుకుని స్థలాలను విక్రయించడంమానుకోవాలని కోరారు. కాంగ్రెస్ పాలన కూకట్‌పల్లికి శాపంగా మారిందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విమర్శించారు. గతంలో టీడీపీ, బీఆర్ఎస్ పాలనలో కూకట్‌పల్లిలో స్థలాలను అమ్మలేదని, గతంలో కాంగ్రెస్ పాలకులే భూములను అమ్మారని, నేడు మళ్లీ భూములను అమ్ముకుంటున్నారన్నారు. కూకట్‌పల్లిలో ప్రజల నుంచి 30 ఎకరాల స్థలాన్ని సర్కార్ సేకరించి, ట్రక్ పార్కింగ్‌కు కేటాయించిందని, నేడు హెచ్ఎండీఏ అధీనంలో ఉన్నా 3.15 ఎకరాల స్థలాన్ని అమ్మకానికి పెట్టిందని, ఈ స్థలాన్ని క్రికెట్ క్రీడాప్రాంగణంగా తీర్చిదిద్దాలని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికే కేపీహెచ్‌బీ కాలనీ వసంతనగర్‌లో 22ఏ తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై పోరాటాలు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లో ప్రభుత్వం పాఠశాల నిర్మాణం కోసం పనులు చేపట్టేందుకు పాలకులు అనుమతులు ఇవ్వడం లేదన్నారు. మియాపూర్‌లో 400 ఎకరాల స్థలాన్ని బీఆర్ఎస్ కాపాడితే... ఇంకా కోర్టు తీర్పు పత్రాలు రాకుండానే అమ్మకానికి పెట్టడం బాధాకరమన్నారు.



అక్రమ నిర్మాణాలను అరికట్టేదెవరు...?

మహేశ్వరం ప్రతినిధి(క్రైమ్ మిర్రర్): శంషాబాద్ జి ఎచ్ ఎం సి పరిధిలోని ఇమామ్ గూడ ప్రాంతం ఇప్పుడు అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారింది. అనుమతులు ఉన్నాయో లేదో తెలియదు, ఉన్నా ఆమోదించిన ప్లాన్ ప్రకారమే కడుతున్నారో తెలియదు. కానీ భారీ ఇనుప షెడ్లు, బహుళ అంతస్తుల వాణిజ్య భవనాలు మాత్రం యథేచ్ఛగా పుట్టుకొస్తున్నాయి. ఇమామ్ గూడలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై గతంలో పలుమార్లు పత్రికల్లో వార్తలు వచ్చాయి. అయినా క్షేత్రస్థాయిలో పరిస్థితి మారలేదు. వార్త వచ్చినప్పుడు అధికారులు స్పందించి విచారణ చేయాల్సింది పోయి, మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. నిర్మాణ స్థలాన్ని అధికారులు ఎప్పుడైనా సందర్శించారా..? నిర్మాణదారుల నుంచి అనుమతి పత్రాలు అడిగారా..?ఉల్లంఘనలు నోటీసులు ఇచ్చారా..?ఈ ప్రశ్నలకు ఇప్పటివరకు సమాధానం లేదు.

టౌన్ ప్లానింగ్ అధికారికి చలనం లేదా..?

భవన నిర్మాణాలు నిబంధనల ప్రకారం జరుగుతున్నాయా లేదా అని పర్యవేక్షించాల్సిన బాధ్యత టౌన్ ప్లానింగ్ విభాగానిదే. అనుమతులు పరిశీలించడం, ఆమోదించిన ప్లాన్ ప్రకారం కడుతున్నారా లేదా తనిఖీ చేయడం, ఉల్లంఘనలు ఉంటే చర్యలకు సిఫారసు చేయడం వారి విధి.మరి ఇమామ్ గూడలో జరుగుతున్న నిర్మాణాలపై టీపీఓ ఎప్పుడైనా క్షేత్రస్థాయి తనిఖీ చేశారా? అనేది ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నరూ.

డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణలో నిర్లక్ష్యం ఎందుకు...?

వరుస ఆరోపణలు వస్తున్నా డిప్యూటీ కమిషనర్ ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, అధికారుల నుంచి నివేదిక తెప్పించి, ఉల్లంఘనలు ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

సామాన్యుడికి ఒక న్యాయం.. .భారీ నిర్మాణాలకు మరో న్యాయమా..?

సామాన్యుడు చిన్న ఇల్లు కట్టుకోవాలంటే అనుమతులు, పత్రాలు, ఫీజులు అంటూ వంద ప్రక్రియలు. మరి భారీ వాణిజ్య భవనాలు, పెద్ద షెడ్ల విషయంలో అదే నిబంధనలు ఎందుకు అమలు కావడం లేదు? అనుమతులు ఉంటే వాటి వివరాలు బయటపెట్టాలి. లేకుంటే, ప్లాన్ కు విరుద్ధంగా కడుతుంటే కూల్చివేతతో సహా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. భవన భద్రత, ఫైర్ నిబంధనలు, రోడ్ మార్జిన్, పార్కింగ్ వంటివి కూడా పరిశీలించాలి.

ఇప్పటికైనా అధికారులు మేల్కొంటారా..?

నిర్మాణాలు పూర్తయిన తర్వాత స్పందించి ఏం లాభం? ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేసి వాస్తవాలను ప్రజల ముందు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మంత్రి శ్రీధర్ బాబును కలిసిన పానుగంటి విజయ్



మునుగోడు క్రైమ్ మిర్రర్ : హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో తెలంగాణ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్స్, పరిశ్రమలు మరియు వాణిజ్య, శాసన వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ను బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి విజయ్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి, బీసీల విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి మరిన్ని అవకాశాలు కల్పించాలని, బీసీ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు స్వయం ఉపాధి అవకాశాలకు ప్రోత్సహించాలని కోరారు.చౌటుప్పల్ లో ఉన్న పరిశ్రమలు, కంపెనీలలో స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీల సంక్షేమం, యువతకు ఉపాధి, పరిశ్రమల అభివృద్ధి, సామాజిక న్యాయం వంటి పలు కీలక అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.


రామప్ప దేవాలయంను సందర్శించిన వివిధ దేశాల అధికారులు, ప్రతినిధులు

వెంకటాపూర్ (రామప్ప), క్రైమ్ మిర్రర్, నవంబర్ 06: మండలం లోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని శుక్రవారం హైదరాబాద్ లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న ఆంటిగ్వా, బార్బుడా, బంగ్లాదేశ్, బోట్స్వానా, ఈజిప్ట్, ఇరాన్, లెబనాన్, లైబీరియా, మాల్దీవులు, మాలి, మారిషస్ నైజీరియా, సిరియా, టాంజానియా, జింబాబ్వే, 14 దేశాల నుండి ఇరవై ఐదు (25) ప్రతినిధులు, అధికారులు అధికారులు భారత్ దర్శన్ లో భాగంగా రామప్ప దేవాలయంను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారికి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ కాకతీయల చరిత్ర, ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం గురించి వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. . వారి వెంట ఈవో ఇమ్మడి భాస్కర్, ఎంపిడివో రాజు, ఆర్ ఐ రమేష్, జిపివో సూరయ్య, ఎంసిహెచ్ఆర్డి అధికారులు, టూరిస్ట్ పోలీసులు బద్రు, శ్రీనివాస్, అరుణ్, శ్రీకాంత్, రెవెన్యూ, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.



నిరాడంబర వివాహం.. ఉన్నత లక్ష్యాల ప్రస్థానం!

- ఐపిఎస్, ఐపీఎస్ అధికారులుగా ఎదిగిన యువ దంపతులుద
- చౌటుప్పల్‌లో రిజిస్టర్ మ్యారేజ్.. శేషాద్రిని రెడ్డి--శ్రీకాంత్ రెడ్డి జంటకు ప్రత్యేక గుర్తింపు
- యూపీఎస్సీ విజయం నుంచి తెలంగాణ క్యాడర్ వరకు.. ఆదర్శంగా నిలుస్తున్న అధికారుల ప్రయాణం









నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్): ఉన్నత విద్య.. కఠోర శ్రమ.. పట్టుదలతో కూడిన లక్ష్యసాధన.. దేశానికి సేవ చేయాలనే సంకల్పం.. ఈ లక్షణాల సమాహారమే ఐఏఎస్, ఐపీఎస్ వంటి అత్యున్నత సివిల్ సర్వీసులు. అలాంటి ప్రతిష్టాత్మక సేవల్లో స్థానం సంపాదించుకున్న ఇద్దరు యువ అధికారులు జీవిత భాగస్వాములుగా ఒక్కటయ్యారు. హోదా, ఆడంబరాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా నిరాడంబరంగా వివాహం చేసుకున్న, ఈ జంట తమ ప్రత్యేకతను చాటుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో, జనవరి 24న జరిగిన ఈ వివాహం స్థానికంగా మాత్రమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తెలంగాణకు చెందిన ఐపీఎస్ అధికారిణి శేషాద్రిని రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాకు చెందిన ఐఏఎస్ అధికారి నెలటూరి శ్రీకాంత్ రెడ్డి వివాహ బంధంతో ఒక్కటయ్యారు. ఇద్దరూ సివిల్ సర్వీసుల్లో తమదైన గుర్తింపు సంపాదించుకున్న యువ అధికారులు కావడంతో ఈ వివాహానికి ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది.

-యూపీఎస్సీ విజయం.. శేషాద్రిని రెడ్డి ప్రస్థానం

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లింగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన శేషాద్రిని రెడ్డి, విద్యాభ్యాసం నుంచే లక్ష్యసాధనకు ప్రాధాన్యతనిచ్చారు. బీటెక్ పూర్తి చేసిన అనంతరం దేశంలోనే అత్యంత కఠినమైన పోటీ పరీక్షగా పేరొందిన, యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షకు సిద్ధమయ్యారు. క్రమశిక్షణ, నిరంతర సాధనతో 2020లో నిర్వహించిన సివిల్ సర్వీసెస్ పరీక్షలో, 401వ ఆల్ ఇండియా ర్యాంక్ సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. 2021 బ్యాచ్‌కు చెందిన ఆమె తెలంగాణ క్యాడర్‌లో పోలీసు సేవల్లోకి అడుగుపెట్టారు. శిక్షణ అనంతరం వివిధ పోలీసు విభాగాల్లో బాధ్యతలు నిర్వహిస్తూ, తన వృత్తిపరమైన ప్రస్థానాన్ని కొనసాగించారు. వేములవాడలో అదనపు ఎస్పీగా పనిచేసిన ఆమె, అనంతరం హైదరాబాద్ పోలీసు విభాగంలో డీసీపీ స్థాయి బాధ్యతలు చేపట్టారు. ఒక గ్రామీణ ప్రాంతం నుంచి అత్యున్నత పోలీసు సేవల్లోకి ఎదగడం శేషాద్రిని రెడ్డి ప్రస్థానంలో విశేషమైన అంశం. ఆమె విజయం గ్రామీణ యువతకు, ముఖ్యంగా సివిల్ సర్వీసులపై ఆసక్తి ఉన్న యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

-కడప నుంచి ఐఏఎస్.. శ్రీకాంత్ రెడ్డి విజయపథం

ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా చిన్నూరుకు చెందిన నెలటూరి శ్రీకాంత్ రెడ్డి సైతం, సివిల్ సర్వీసుల్లో ఉన్నత స్థానం సంపాదించుకున్నారు. బీటెక్ విద్యను పూర్తి చేసిన అనంతరం సివిల్ సర్వీసులపై దృష్టి సారించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. 2025 బ్యాచ్‌కు చెందిన ఆయనకు, తొలుత ఏజీఎంయూటీ క్యాడర్ కేటాయించారు. సివిల్ సర్వీసుల్లో ఎంపిక కావడం ఒక ఎత్తయితే, ఐఏఎస్ అధికారిగా శిక్షణ పొంది దేశ పరిపాలనా వ్యవస్థలో భాగం కావడం మరో కీలకమైన దశ. శ్రీకాంత్ రెడ్డి ఈ ప్రస్థానంలో ముందుకు సాగుతూ, తన వృత్తి జీవితానికి పునాది వేసుకున్నారు. ఒకవైపు తెలంగాణ పోలీసు శాఖలో బాధ్యతలు నిర్వహిస్తున్న ఐపీఎస్ అధికారిణి.. మరోవైపు ఐఏఎస్ శిక్షణలో ఉన్న అధికారి.. ఇరువురి లక్ష్యాలు, వృత్తిపరమైన నేపథ్యాలు ఒకే దిశలో ఉండటం ఈ జంట ప్రత్యేకతగా నిలుస్తోంది.

-ఆడంబరాలకు దూరంగా.. చౌటుప్పల్‌లో వివాహం

సాధారణంగా ఉన్నతాధికారుల వివాహాలు భారీ వేడుకలు, ఆడంబరాలతో జరుగుతాయని భావిస్తుంటారు. అయితే శేషాద్రిని రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి ఇందుకు భిన్నంగా నిరాడంబరమైన పద్ధతిని ఎంచుకున్నారు. 24 జనవరి 2026న చౌటుప్పల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వివాహాన్ని నమోదు చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో చట్టపరమైన వివాహ ప్రక్రియను పూర్తి చేసి, అనంతరం పూలమాలలు మార్చుకున్నారు. ఉన్నత హోదాల్లో ఉన్నప్పటికీ వివాహ వేడుకను సాధారణంగా నిర్వహించుకోవడం ఈ జంటకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. వివాహానికి సంబంధించిన వార్తలు వెలువడటంతో చౌటుప్పల్ మండలం లింగారెడ్డిగూడెం గ్రామంలో ఆనందం వ్యక్తమైంది. తమ ప్రాంతానికి చెందిన ఐపీఎస్ అధికారిణిగా ఎదిగి, మరో ఉన్నతాధికారిని జీవిత భాగస్వామిగా చేసుకోవడం స్థానికులకు గర్వకారణంగా మారింది.

-వివాహానంతరం కీలక పరిణామం.. తెలంగాణ క్యాడర్‌కు శ్రీకాంత్ రెడ్డి

ఈ జంటకు సంబంధించిన మరో ముఖ్యమైన పరిణామం ఐఏఎస్ అధికారి శ్రీకాంత్ రెడ్డి క్యాడర్ మార్పు. తొలుత ఏజీఎంయూటీ క్యాడర్‌కు కేటాయించబడిన ఆయన, శేషాద్రిని రెడ్డితో వివాహం అనంతరం తెలంగాణ క్యాడర్‌కు మారారు. కేంద్ర ప్రభుత్వ సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖకు చెందిన డీఓపీటీ 2026 మార్చి 19న క్యాడర్ మార్పుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది. వివాహ ప్రాతిపదికన క్యాడర్ మార్పుకు అనుమతి లభించడంతో, ఆయన తెలంగాణలో సేవలు కొనసాగించే అవకాశం ఏర్పడింది. దేశవ్యాప్తంగా సివిల్ సర్వీసుల్లో క్యాడర్ కేటాయింపు, మార్పులు నిర్దిష్ట నిబంధనలకు లోబడి జరుగుతాయి. భార్యాభర్తలు వేర్వేరు క్యాడర్లలో ఉన్న సందర్భాల్లో సంబంధిత నిబంధనలు, ప్రభుత్వ అనుమతుల మేరకు క్యాడర్ మార్పు పరిశీలనకు వస్తుంది. శ్రీకాంత్ రెడ్డి విషయంలోనూ ఈ ప్రక్రియ పూర్తయింది.

-గ్రామీణ యువతకు స్ఫూర్తి.. లక్ష్యం ఉంటే సాధ్యం

సివిల్ సర్వీసుల్లో విజయం సాధించడం అనేది కేవలం విద్యార్హతలతో సాధ్యమయ్యే విషయం కాదు. నిరంతర సాధన, క్రమశిక్షణ, సమయపాలన, అపజయాలను అధిగమించే ధైర్యం అవసరం. శేషాద్రిని రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి ప్రస్థానాలు ఈ అంశాలను గుర్తు చేస్తున్నాయి. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన యువత సైతం జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటగలరని శేషాద్రిని రెడ్డి విజయం స్పష్టం చేస్తోంది. మరోవైపు శ్రీకాంత్ రెడ్డి ఐఏఎస్ ఎంపిక కూడా ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి ఎంత ముఖ్యమో తెలియజేస్తోంది. ఉన్నత పదవులు, బాధ్యతలు, వృత్తిపరమైన లక్ష్యాలతో పాటు వ్యక్తిగత జీవితంలోనూ ఒకరినొకరు అర్థం చేసుకుంటూ, ముందుకు సాగడం ఈ జంటకు మరింత ప్రత్యేకతను తీసుకొస్తోంది. ఆడంబరాల కంటే ఆత్మీయతకు, హోదాల కంటే మానవీయ విలువలకు ప్రాధాన్యతనిచ్చిన ఈ వివాహం యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. ఒకే కుటుంబంలో రెండు ఉన్నత సివిల్ సర్వీసులు.. ఒకే లక్ష్యం దేశసేవ.. నిరాడంబర వివాహంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న శేషాద్రిని రెడ్డి--శ్రీకాంత్ రెడ్డి జంట ప్రస్థానం నిజంగా స్ఫూర్తిదాయకం.

విచారంలో విచారణ నివేదిక.. నాలుక గీసుకునే పరిస్థితి కరువు..!

- అండగా ముగ్గురు నేతలు.. సస్పెండ్ నిలిపివేత..!
- విచారణ జరగకుండా ఆపేది మీరే, విచారణ పూర్తయిన నివేదికపై చర్యలు నిలిపేది తమరే.!
- ఖుధాబక్షుపల్లి, లెంకలపల్లి గ్రామాల విచారణ నివేదిక బూడిదపాలేనా!
- ఉన్నత అధికారులు ఎందుకు ఆ నివేదికలపై చర్యలు తీసుకోవడం లేదు!
- ఏడు ఏండ్ల నుండి ఒకే మండలంలో కొలువు.. బదిలీ మరిచిపోయారా, లేక మరిపిస్తున్నారా..!
- డీపీవో విచారణలో తమరికేం పని.. అధికారివా, సర్పంచ్ వా, లేక స్వచ్ఛంద సంస్థ ప్రతినిధివా..!
- బహిరంగగా ప్రెస్ మీట్.. సెక్రటరీలకు నిబంధనలు వర్తించవా.. మూకుమడి సెలవులు కోరడం మీ ఇష్టమేనా..!



మర్రిగూడ(క్రైమ్ మిర్రర్): రాజకీయం ఎంతటి పని చేస్తుందో చూడండి. విచారణ జరిగిన నివేదికపై చర్యలను సైతం ఆపేస్తున్నారు.. మర్రిగూడ మండలంలో ఖుధాబక్షుపల్లి, లెంకలపల్లి గ్రామాల నిధులపై వచ్చిన పిర్యాదుల మేరకు, ఉన్నత అధికారుల ఆజ్ఞల ప్రకారం విచారణ జరిపారు. ఆపై నివేదికను జిల్లా ఉన్నత అధికారులకు నివేదించారు. కానీ ఈ విచారణ, నివేదిక సైతం రాజకీయ నాయకుల చెప్పు కింద, మగ్గిపోతుందనేది పలువురి అభిప్రాయం..!? నిజానికి అది నిజమనే అంటున్నారు చాలా మంది. ఈ రెండు గ్రామాలపై విచారణ పూర్తయి నెలలు గడుస్తున్నప్పటికి, ఆ నివేదిక నాలుక గీసుకోవడానికి కూడా పనికి రాకుండాపోవడం విడ్డూరం..!? నివేదిక చూసారా లేక చెదపట్టిందా అంటున్నారు పలువురు..!? పలు పిర్యాదుల నేపథ్యంలో ఈ గ్రామాలపై ఉన్నత అధికారులు విచారణ జరిపారు. అట్టి నివేదిక సైతం జిల్లా కలెక్టర్ కి కూడా చేరింది..!? కానీ ఈ నివేదికపై చర్యలు తీసుకోకుండా నిలిపివేస్తున్నారు మండలంలోని ముగ్గురు నేతలు!? ఒకరేమో ఏ పార్టీనో తెలియదు, మరొక్కరు అదే పార్టీలో ఉండి వెన్నుపోటు పొడుస్తారు, ఇంకొక్కరు ఎలాంటి లీడరో అర్థం కాదు.!? అలాంటి నేతల మాటలు వింటూ, జిల్లా ఉన్నత అధికారులు, విచారణ జరిగిన నివేదికపై చర్యలు తీసుకోకపోవడం హాస్యాస్పదం..!? ఈ నేతలు ఏకంగా సస్పెండ్ ను సైతం నిలిపివేస్తున్నారు, ఆ ఫైల్ ఏ స్థాయిలో ఉందో తెలుసుకోగలుగుతున్నారంటే, మన ఉన్నత అధికారుల లాలూచి ఏ స్థాయిలో ఉందో తెలియాల్సి ఉన్నది.!? ఇదంతా ఒక ఎత్తయితే 15వ ఆర్థిక సంఘం నిధుల, విచారణ జరగాల్సిన గ్రామాలను కూడా, ఉన్నత అధికారులను మభ్యపెట్టి నిలిపివేయడం విస్మనీయం..!

-ఖుధాబక్షుపల్లి, లెంకలపల్లి విచారణ బూడిదపాలేనా

నేను గిచ్చినట్లు చేస్తా, నువ్వు ఏడ్చినట్లు చెయ్.. అనే సామెతకు, ఏమాత్రం తేడా లేకుండా పోయింది అధికారుల చర్యలు. పిర్యాదు వచ్చింది ఎంక్వయిరీ చేసాము.. అంతే కానీ అధికారుల చర్యలు అందని ద్రాక్షలా మారింది.!? ఇప్పటికే విచారణ పూర్తయిన గ్రామాలపై ఎటువంటి చలనం లేకపోవడం, విచారణ జరగాల్సిన గ్రామాలపై ఉలుకు పలుకు లేకపోవడంతో, అధికారుల చర్యలకు ఏమాత్రం విలువ లేకుండాపోయింది..!? ఇప్పటికి ఉన్నత అధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది.! ఈ నిర్లక్ష్యంతో ఉన్నత అధికారులు సభ్యసమాజానికి ఎం మెస్సేజ్ ఇస్తున్నారో అధికారులే చెప్పాలి..!

-ఏండ్ల నుండి ఒకే మండలంలో కొలువు.. బదిలీ మరిచారా.. మరిపిస్తున్నారా..!

ఏండ్ల నుండి ఒకే మండలంలో ఉద్యోగం చెయ్యడం, స్థానిక నాయకుల పలుకుబడి, రాజకీయ అండదండలు పెరగడంతో, తాము ప్రభుత్వ ఉద్యోగులమనే విషయాన్ని మరిచిపోయారని, ఉద్యోగం మరిచి రాజకీయాలు చేస్తూ మండలాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని ప్రజల వాదన..!? తాము చెయ్యాల్సిన బాధ్యతలను మరిచి, ఉన్నత అధికారులను బెదిరించే స్థాయికి సెక్రటరీలు ఎదిగారనే వాదన రోజు రోజుకు బలపడుతుంది..!? ఏండ్ల నుండి సొంత స్థానిక మర్రిగూడ మండలంలో పని చేస్తున్న సెక్రటరీలపై, ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నలు తలెత్తుతున్నాయి..!? గతంలో ఎన్నికల సమయంలో సస్పెండ్ అయిన ఈ ఉద్యోగి, మళ్ళీ పైరవితో అదే మండలంలో పోస్టింగ్ తెచ్చుకోవడం దేనికి సంకేతం..!? ఏకంగా ఉన్నత అధికారులపై ఆరోపణలు చేస్తూ ప్రెస్ మీట్ పెట్టడం నిబంధనలకు విరుద్ధం కాదా.. వారికి సిసిఏ నిబంధనలు వర్తించవా..!? మూకుమడి సెలవులు పెట్టి, ఎవరిని



బెదిరిస్తున్నారు..! గ్రామ అభివృద్ధి అంటే లెక్కలేదా..! పంచాయతీ సెక్రటరీల ఈ ప్రవర్తనపై ఉన్నత అధికారుల మౌనం వెనుక అంతర్యం ఏమైఉంటుంది..!

-డీపీఓ విచారణలో మీకేం పని.. ఆహ్వానం వచ్చిందా పదురుకొని వచ్చారా..

ఎంపీడీఓ పై వచ్చిన పిర్యాదు నేపథ్యంలో, డీపీవో విచారణకై మర్రిగూడ వచ్చారు.. ఈ విచారణకు అధికారులు మాత్రమే హాజరు కావలసి ఉండగా, మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రస్తుత ప్రజా ప్రతినిధుల భర్తలు దర్శనం ఇవ్వడం విడ్డూరం..! వచ్చిన ఆ నేతలు విచారణ అధికారి డీపీవోకు పర్సనల్ ఎజెండాతో కక్కేసుకోవడం వెనుక, ఓ యువ నాయకుడి పిర్యాదు లెక్కకు రావద్దని అక్కసుకక్కడం నిజం కాదా..! ఖుధాబక్షుపల్లి విచారణపై సెక్రటరీని సస్పెండ్ చెయ్యొద్దని, ఆ మాజీ నేత చేస్తున్న హంగామా అంతా ఇంతా కాదనే చెప్పుకోవాలి..! నిర్లక్ష్యం, తప్పు చేసే అధికారికి వత్తాసు పాడటం, పర్సనల్ ఎజెండాతో మిగతా అధికారులపై నోరు పారేసుకోవడం విడ్డూరం..! అసలు డీపీఓ విచారణకు నీకేం పని, ఆ విచారణలో హంగామా చేసే హక్కు ఎవరిచ్చారు.. ఈ హంగామా దేనికి చేస్తున్నావో జనాలకు తెలియదా..! మీ పర్సనల్ అంశాలతో ఇంకా ఎంతమంది దళితులను ఆగం చెయ్యనున్నారో చెప్పండి.! పంచాయతీ సెక్రటరీలు బహిరంగగా ప్రెస్ మీట్ పెట్టడం, మూకుమడి సెలవుల నిరసన తెలపడం, ఏ నిబంధనలలో ఉందని ప్రజలు అడుగుతున్నారు..! విచారణ పూర్తయిన నివేదికపై ఉన్నత అధికారుల గుడ్డిచూపు వెనుక, అసలు మతులబుపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి..! ఇప్పటికైనా ఉన్నత అధికారులు విచారణ జరిగిన గ్రామాల నివేదికపై చర్యలు తీసుకోవాలని, 15వ ఆర్థిక సంఘం నిధులపై మండల వ్యాప్తంగా ఎంక్వయిరీ జరగాలని మర్రిగూడ వాసులు కోరుతున్నారు..!



రామప్ప దేవాలయంను సందర్శించిన భూపాలపల్లి కలెక్టర్

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన శుభాకాంక్షలు మంత్రి సీతక్క

వెంకటాపూర్ (రామప్ప), క్రైమ్ మిర్రర్, నవంబర్ 06:: మండలం లోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని శుక్రవారం భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారికి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ లు ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం, కాకతీయుల చరిత్ర గురించి వివరించారు. ఈ సందర్భంగా రామప్పను సందర్శించడానికి విచ్చేసిన మంత్రి సీతక్క కలెక్టర్ రాహుల్ శర్మ కు పుట్టినరోజు తెలిపి, శాలువా తో సత్కరించారు. వారి వెంట ఈవో ఇమ్మడి భాస్కర్, ఆర్ ఐ రమేష్, టూరిస్ట్ పోలీసులు శ్రీనివాస్, దశరథ్, బద్రు, అరుణ్, శ్రీకాంత్, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

సైక్లింగ్‌లో సత్తా చాటిన భూపాలపల్లి బాలికలు..!!

- ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి పోటీల్లో రేగొండ విద్యార్థినుల ప్రతిభ
- అండర్-14లో అంజలి, అండర్-17లో గౌతమి విజయం
- రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై జిల్లాకు గర్వకారణం

క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి: క్రీడా మైదానంలో ప్రతిభకు వయసుతో సంబంధం లేదని నిరూపించారు జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థినులు. సైక్లింగ్ పోటీల్లో తమ సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లోని దేశాయిపేట హైస్కూల్‌లో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీల్లో రేగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. అండర్-14 బాలికల విభాగంలో వై. అంజలి, అండర్-17 బాలికల విభాగంలో ఎం. గౌతమి తమ ప్రతిభతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థినుల విజయంపై జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి సీహెచ్. రఘు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ఇదే ఉత్సాహంతో రాణించి జిల్లాకు మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థినుల విజయానికి కృషి చేసిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ విజిత, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. మారుమూల ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రతిభావంతులైన క్రీడాకారిణులు ఉన్నారనే విషయాన్ని ఈ విజయం మరోసారి చాటిచెప్పింది.





బీజేపీ రంగారెడ్డి జిల్లా వికలాంగుల కన్వీనర్‌గా పరనంది నాగులుకు ఘన సన్మానం...

క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి: మసీద్‌బండలోని శేరిలింగంపల్లి బీజేపీ పార్టీ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ వికలాంగుల కన్వీనర్‌గా నియమితులైన పరనంది నాగులును శేరిలింగంపల్లి నాయకులు రవికుమార్ యాదవ్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అదేవిధంగా బీజేపీ నాయకులు జాజిరావు శ్రీధర్ జన్మదిన వేడుకలు నిర్వహించి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు గుండె గణేష్ ముదిరాజ్, ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్, సారా రాము తదితరులు పాల్గొన్నారు.

యువ క్రైస్తవ మహిళలపై దాడి... నిందితులను అరెస్టు చేసిన పోలీసులను అభినందించిన పాస్టర్స్ ఫెడరేషన్.

క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి: యువ క్రైస్తవ మహిళలపై జరిగిన దాడిని ఆల్ ఇండియా పాస్టర్స్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర విభాగం తీవ్రంగా ఖండించింది. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రెవ. డాక్టర్ పి. ఇశ్రాయేలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెవ. ఎన్. శామ్యూల్ విజయ్ మాట్లాడుతూ సకాలంలో స్పందించి ఎఫ్ఐఆర్ నమోదు చేసి బాధ్యులను అరెస్టు చేసిన తెలంగాణ పోలీసుల చర్యను అభినందించారు. ఈ విషయంలో సకాలంలో స్పందించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నాయకత్వాన్ని కూడా వారు అభినందించారు.

రంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు పారిజాత నరసింహారెడ్డి కి ఘనంగా అభినందనలు...

క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి : రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలి గా బాధ్యతలు చేపట్టిన పారిజాత నరసింహారెడ్డిని మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు యలమంచి ఉదయ్ కిరణ్, ఆల్విన్ కాలనీ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పారిజాత నరసింహారెడ్డిని శాలువాతో సత్కరించి, మొక్కను అందజేశారు. ఆమె సమర్థవంతమైన నాయకత్వంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని, క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేసే దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద నగర్ సీనియర్ నాయకులు బాష్పాక యాదగిరి, బాబ్జి, సాయి లోహిత్, శశి తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లిలో రూ.4 కోట్ల చిట్ ఫండ్ మోసం: ప్రధాన నిందితుడు అరెస్ట్..!

అధిక వడ్డీ ఆశ చూపి రూ.3.62 కోట్లు వసూలు...48 మందికి కుచ్చుటోపి....! **నమ్మకంతోనే మోసం....పరిచయస్తుడే రూ.4 కోట్లు కొట్టేశాడు**

ఫ్యూచర్ సిటీ ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):: శంకర్‌పల్లిలో సంచలనం సృష్టించిన రూ.4 కోట్ల చిట్ ఫండ్ మోసం కేసులో ఫ్యూచర్ సిటీ పోలీసులు కీలక పురోగతి సాధించారు. 48 మందిని మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన నిందితుడు గుడిశెట్టి సుధాకర్ (50)ను అరెస్ట్ చేశారు. శంకర్‌పల్లి ఎస్‌హెచ్‌వో ఇన్‌స్పెక్టర్ జి. రుద్వీర్ కుమార్ నేతృత్వంలోని బృందం నవంబర్ 5న నిందితుడిని అదుపులోకి తీసుకుని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించింది.

2021 నుంచి వసూళ్లు.. 2024లో పరార్

శంకర్‌పల్లి రైల్వే స్టేషన్ రోడ్‌కు చెందిన సుధాకర్, అతని భార్య లక్ష్మి, మరికొందరు సహచరులతో కలిసి 2021 నుంచి 2024 వరకు చిట్టీల పేరుతో డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆకర్షణీయమైన వడ్డీ, అధిక లాభాలు ఇస్తామని నమ్మబలికిన సుధాకర్, బాధితుల నుంచి నెలకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు, అంతకంటే ఎక్కువ మొత్తాలను వసూలు చేశాడు.సుమారు 48 మంది నుంచి రూ.3,62,41,000 వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మొత్తం వసూళ్లు రూ.4 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ ఉండవచ్చని అంచనా. ఫిర్యాదుదారుడు పర్సి అశ్విన్ (40) ఒక్కడే ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా రూ.6.60 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. జూన్ 2024లో డబ్బులు చెల్లించకుండా సుధాకర్ అదృశ్యమయ్యాడు. పలుమార్లు సంప్రదించినా స్పందన లేకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. “తెలిసిన వ్యక్తి అయినా గుడ్డిగా నమ్మవద్దు” – ఎస్‌హెచ్‌వో హెచ్చరిక ఈ సందర్భంగా శంకర్‌పల్లి ఎస్‌హెచ్‌వో జి. రుద్వీర్ కుమార్ ప్రజలకు కీలక సూచనలు చేశారు.అధిక లాభాల ఆశతో పెట్టుబడులు పెడితే కష్టార్జితాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. కొంతమంది ఏళ్ల తరబడి ఉన్న పరిచయాలు, స్నేహ సంబంధాలను ఆసరాగా చేసుకుని నమ్మకాన్ని సంపాదించి మోసం చేస్తున్నారు. చాలా కాలంగా తెలిసిన వ్యక్తి అయినంత మాత్రాన గుడ్డిగా నమ్మి డబ్బులు అప్పగించవద్దు. ఏదైనా పథకంలో పెట్టుబడి పెట్టే ముందు సంస్థ రిజిస్ట్రేషన్, విశ్వసనీయతను పరిశీలించాలి. ప్రతి ఆర్థిక లావాదేవీకి ఆధారాలు భద్రపరచుకోవాలి. మోసం జరిగిందని అనుమానం వస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలి” అని ఆయన సూచించారు.ఈ కేసులో ఆర్థిక లావాదేవీలు, ఇతర బాధితుల వివరాలు, మిగతా వ్యక్తుల ప్రమేయంపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



నడిగడ్డ తండా, సుభాష్ చంద్రబోస్ నగర్ సమస్యల పై పీఏసీ చైర్మన్ గాంధీ సమీక్ష...

క్రైమ్ మిర్రర్ మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని నడిగడ్డ తండా, సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీల సమస్యలు, అభివృద్ధి పనులపై వివేకానంద నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో సమీక్షా సమావేశం జరిగింది. పీ ఏ సీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, సీఆర్ పీఎఫ్డక్షిణ విభాగం ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావు, మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సిఎంసీ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ నడిగడ్డ తండాలో అసంపూర్తిగా మిగిలిన రోడ్లు, యు జీ డీ పైప్‌లైన్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని సీఫ్ సీ ఆర్ పీ ఎఫ్ ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మియాపూర్ మెట్రో పిల్లర్ నంబర్ 600 నుంచి మియాపూర్ మెట్రో స్టేషన్ వరకు సర్వీస్ రోడ్డు విస్తరణ కోసం సీ ఆర్ పీ ఎఫ్ అధీనంలోని స్థలంలో రోడ్డు వేయడానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. రోడ్డు సగంలో ఆగిపోవడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయని, సర్వీస్ రోడ్డు వస్తే ప్రజలకు సమయం, ఇంధనం ఆదా అవుతుందని తెలిపారు. నడిగడ్డ తండా నుంచి హెచ్డీఫ్సీ బ్యాంక్ బొల్లారం రోడ్డు పక్కన మురుగునీరు చేరి ఇబ్బందులు కలుగుతున్నాయని, యు జీ డీ పనులకు అనుమతులు వస్తే వెంటనే పూర్తి చేస్తామని చెప్పారు.ఈ అంశాలపై సీ.ఆర్. పీ. ఎఫ్.ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావు సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో సిఎంసీ ఎస్.ఈ. శ్రీకాంతిని, డీ.ఈ. బాలమురళి, ఏ. ఈ.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

క్రైమ్ మిర్రర్,మంగపేట: మండలంలోని బ్రాహ్మణ పల్లి గ్రామంలో అనారోగ్యంతో ఇటీవల ఇద్దరు కొడుకులను కోల్పోయి దుఃఖంలో ఉన్న తల్లి తండ్రులు వజ్జా శంకర్, సరోజన దంపతులను శుక్రవారం ములుగు జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి బాడిశ నాగ రమేష్ పరామర్శించారు.మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి అండగా ఉంటామని ఓదార్చి ధైర్యం చెప్పారు.అనంతరం స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు జమ చేసిన రూ,4000 నగదును నాగ రమేష్ చేతుల మీదగా కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయంగా అందజేశారు.ఈ సందర్భంగా బాడిశ నాగ రమేష్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ పేదల పార్టీ అని,ప్రతీ ఒక్క పేద కుటుంబానికి అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు పండా శ్రీను,బాడిశ నర్సింగరావు ,చౌలం రాంబాబు,కొమరం పుల్లారావు,కల్తీ అశోక్,రూప భద్రయ్య,మునిగేలా మహేష్,మండల సంతోష్,నిట్టా శ్యామ్ (బన్ను),కొమరం నితిన్ కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.





చలో ఉస్మానియా యూనివర్సిటీని జయప్రదం చేయండి

క్రైమ్ మిర్రర్,మంగపేట: ఈ నెల 15న హైదరాబాద్‌లో జరిగే హలో నేతకాని చలో ఉస్మానియా సమావేశాన్ని విజయవంతం చేయాలని ఉస్మానియా ప్రొఫెసర్ జాడి మురళీధర్ పిలుపునిచ్చారు.మండలంలోని తిమ్మంపేట గ్రామంలో శుక్రవారం నేతకాని కుల సంఘం నాయకులతో కలిసి ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జాడి మురళీధర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే సమావేశానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు.విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన హైదరాబాదులో'హలో నేతకాని చలో ఉస్మానియా' కార్యక్రమానికి నేతకాని సమాజానికి చెందిన ప్రజలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మురళీధర్ కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణలో ఎస్సీ ఉపకులాలలో అతి పెద్ద జనాభా గలిగిన వర్గాల్లో నేతకాని జాతి జనాభా ప్రాతిపదికన సరైన అవకాశాలు లభించకపోవడం వల్ల విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో నేతకాని వర్గం వెనుకబాటుకు గురవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.హక్కుల సాధన మరియు భవిష్యత్ కార్యాచరణ అన్ని రంగాలలో జరుగుతున్న నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని తమ హక్కుల సాధన కోసం ఈ సమావేశం దోహదపడుతుందని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దిగొండ కాంతారావు జిల్లా ఉపాధ్యక్షుడు పూసల నరసింహారావు జిల్లా మీడియా ఇన్చార్జి బసారి నాగార్జున గ్రామ కమిటీ అధ్యక్షుడు దుర్గం బిక్షపతి నాయకులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్ రెడ్డికి ఘన సన్మానం

టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన చైర్మన్

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: ఆమనగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గూడూరు శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహతో కలిసి హైదరాబాద్‌లోని ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా నూతనంగా చైర్మన్ బాధ్యతలు చేపట్టి తొలిసారిగా తన నివాసానికి వచ్చిన గూడూరు శ్రీనివాస్ రెడ్డికి ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. నూతన పాలకవర్గం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సహకార సంఘం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.



బాలల హక్కులు -- బాలల సమస్యలపై అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలకు అవగాహన మరియు సామర్థ్య పెంపు శిక్షణ కార్యక్రమం

క్రైమ్ మిర్రర్ ఖమ్మం జిల్లా : బాలల హక్కుల పరిరక్షణ, బాలల సమగ్ర అభివృద్ధి, బాలలపై జరుగుతున్న వివిధ రకాల హింస, వివక్ష, దోపిడీ వంటి సమస్యలను గుర్తించి, వాటి నివారణకు సమర్థవంతంగా పనిచేసే దిశగా బోనకల్ రైతు వేదికలో అన్ని గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలకు చైల్డ్ రైట్స్ అండ్ యు(క్రై) సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. గ్రామస్థాయిలో బాలలతో నిత్యం అనుసంధానమై పనిచేసే అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలకు విసిపిసి కమిటీ సభ్యులుగా వారి బాధ్యతలు, బాలల హక్కులు, బాలల రక్షణ వ్యవస్థ, బాలల సమస్యల గుర్తింపు మరియు వాటి పరిష్కార మార్గాలపై అవగాహన కల్పించారు. క్రై సంస్థ ప్రతినిధి సురేష్ నిర్వహించిన శిక్షణలో భాగంగా బాలల హక్కుల ప్రాముఖ్యత, బాలలపై జరుగుతున్న శారీరక, మానసిక హింస, బాల కార్మికత్వం, బాల్యవివాహాలు, బాలల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు, పోషకాహార లోపం, బడి మానేసే పిల్లల సమస్యలు తదితర అంశాలపై వివరంగా చర్చించారు. అదేవిధంగా బాలలపై జరుగుతున్న హింస లేదా హక్కుల ఉల్లంఘనలను ముందుగానే గుర్తించడం, బాధిత పిల్లలకు తక్షణ సహాయం అందించడం, సంబంధిత శాఖల అధికారులకు సమాచారం అందించడం, అవసరమైన సందర్భాల్లో చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలను వినియోగించుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామస్థాయిలో పనిచేసే అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు బాలల ఆరోగ్యం, పోషణ, విద్య, రక్షణ విషయంలో కీలక పాత్ర పోషిస్తారని, బాలల హక్కుల పరిరక్షణలో కూడా చురుకైన భాగస్వాములుగా ఉండాలని శిక్షణలో సూచించారు. బాలల సమస్యల పరిష్కారానికి గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీలు (ఎజూజం), అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, పోలీస్ శాఖ మరియు ఇతర సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఎంతో అవసరమని వివరించారు. ప్రతి గ్రామంలో బాలలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన, హక్కులకు భంగం కలగని వాతావరణాన్ని కల్పించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తదనంతరం అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలను బృందాలుగా చేసి పిల్లలు ఎదుర్కొనే సమస్యల గురించి ప్రాక్టికల్ సెషన్ నిర్వహించి వారి ద్వారానే సమస్యకు సమాధానాలను గుర్తించారు. ఈ కార్యక్రమంలో క్రై సంస్థ ప్రతినిధులు కె విజయ కుమార్, సురేష్, కరుణ, అరుణ, నరసమ్మ, గురవమ్మ, రాణి, ఉషా తదితరులు పాల్గొన్నారు.



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మరోసారి సత్తా చాటాలని టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నిక ఏదైనా కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. శుక్రవారం కడ్తాల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల హెల్ప్‌డెస్క్‌ను ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోతుగంటి శంకర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చేగూరి వెంకటేష్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్‌లతో కలిసి ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు. హెల్ప్‌డెస్క్ ద్వారా పట్టభద్రులకు అందిస్తున్న సేవల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎంతో ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు నమోదు ప్రక్రియపై గ్రామాలు, తండాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పట్టభద్రులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారి సౌలభ్యం కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ ఉన్న విలువైన హక్కు అని, అర్హులైన వారెవరూ నమోదు ప్రక్రియకు దూరం కాకుండా చూడాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాలకుర్ల అద్దాల రాములు, మాలే మల్లేష్ గౌడ్, గురిగల లక్ష్మయ్య, షాబుద్దీన్, సత్యం తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్, ఇండియా కూటమి తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలి : కొలను శంకర్ రెడ్డి

బాలాపూర్ (క్రైమ్ మిర్రర్): భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చూగ్, సంజయ్ భాటియా లను మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలియజేసిన కొలను శంకర్ రెడ్డి. దేశంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పాలన సజావుగా సాగుతున్న, కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి దేశ వ్యతిరేక చర్యలు చేస్తూ బిజెపి పాలన పై చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలని అలాగే సర్ ప్రక్రియపై తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలని జాతీయ నాయకుల సూచించారని కొలను శంకర్ రెడ్డి తెలిపారు.





విద్యార్థుల విద్యాభివృద్ధికి కాంగ్రెస్ నాయకుల చేయూత

వెల్జాల్ పాఠశాలకు ఫ్యాన్లు, విద్యార్థులకు పెన్నుల పంపిణీ

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి(తలకొండపల్లి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ కాంగ్రెస్ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్జాల్ ఎం.పి.ఎస్. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లావణ్యకు ఫ్యాన్లను అందజేశారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. గ్రామంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు సైతం పెన్నులను అందజేశారు. విద్యార్థులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు, వారి విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. పుట్టినరోజు వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా, విద్యార్థులకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని బాగా చదివి జీవితంలో మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వెల్జాల్ కాంగ్రెస్ కమిటీ తరఫున ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెర్ల వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీలు జి. శ్రీనివాసమూర్తి, ఎం. అంబాజీ, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఏ. అంజయ్య గౌడ్, మాజీ ఉపసర్పంచులు బి. నర్సింలు, అజీజ్, నాయకులు అశోక్ బాబు, టి. కృష్ణయ్య గౌడ్, ఎం.డి. ఆరిఫ్, వద్దే రాజు, పులిజాల విష్ణు, బి. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ సిపి వి సి సజ్జనార్ ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలియజేసిన రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి **(బాలాపూర్ క్రైమ్ మిర్రర్)**



రైతుల సంక్షేమమే లక్ష్యంగా పీఏసీఎస్ పాలకవర్గాలు పనిచేయాలి

సహకార సంఘాలను మరింత బలోపేతం చేయాలి.. ఎంపీ డాక్టర్ మల్లు రవి



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: సహకార సంఘాల నూతన పాలకవర్గాలు రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ఫోరం కన్వీనర్, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు వ్యవసాయ రంగ అభివృద్ధికి దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. ఆమనగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గూడూరు శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహతో కలిసి హైదరాబాద్‌లోని ఎంపీ డాక్టర్ మల్లు రవి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన చైర్మన్ గూడూరు శ్రీనివాస్ రెడ్డిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ రెడ్డికి ఎంపీ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ.. సహకార సంఘాలు గ్రామీణ వ్యవసాయ రంగానికి వెన్నెముక వంటివని, వాటిని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత నూతన పాలకవర్గాలపై ఉందన్నారు. రైతులకు సకాలంలో పంట రుణాలు అందించడంతో పాటు నాణ్యమైన విత్తనాలు, ఎరువుల పంపిణీలో పారదర్శకత పాటించాలని సూచించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు మరింత ఊతం లభిస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో దశలవారీగా అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. నూతన చైర్మన్ గూడూరు శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో ఆమనగల్లు పీఏసీఎస్ రైతులకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ, రైతుల అభ్యున్నతికి కృషి చేయాలని ఎంపీ ఆకాంక్షించారు.

కోదాడ అభివృద్ధి పనులను వేగం పెంచాలి!

యూజీడీ, నూతన మున్సిపల్ భవన నిర్మాణ పనులపై ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సమీక్ష

నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి.. అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం



కోదాడ, నవంబర్ 6 (క్రైమ్ మిర్రర్): కోదాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోదాడ శాసనసభ్యురాలు నలమాద పద్మావతి రెడ్డి అధికారులను ఆదేశించారు. పట్టణంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై శుక్రవారం కోదాడలోని తన క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో చేపడుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనులు, నూతన మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఆయా పనుల ప్రస్తుత పురోగతి, నిర్మాణ సమయంలో ఎదురవుతున్న సమస్యలు, పనులు పూర్తయ్యేందుకు పట్టే సమయం తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ.. కోదాడ పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని, పనుల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.అదేవిధంగా నూతన మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని, పట్టణ ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి పనులకు ఎదురవుతున్న అడ్డంకులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో కోదాడ పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి పేర్కొన్నారు.పట్టణ అభివృద్ధిలో అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను సకాలంలో పూర్తి చేసి మెరుగైన సేవలు అందించాలని ఆమె సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్, పబ్లిక్ హెల్త్, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి : బోయపల్లి రాఘువేందర్ రెడ్డి

బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) : జిహెచ్ఎంసి బడంగ్పేట్ సర్కిల్ అల్మాస్గూడ అంబేద్కర్ సెంటర్ నుండి గుర్రంగూడ శివాలయం వరకు ప్రధాన రహదారి అభివృద్ధిలో భాగంగా జీహెచ్ఎంసీ జనరల్ ఫండ్ ద్వారా రూ.2 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు, డ్రైనేజీ పనులకు గుర్రంగూడ శివాలయం మెయిన్ రోడ్డు వద్ద బోయపల్లి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ పనుల్లో భాగంగా బీటీ రోడ్డుకు రూ.1.20 కోట్లు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.80 లక్షలు కేటాయించారు. ఈ పనులు పూర్తయితే ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యంతో పాటు డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఇన్చార్జి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, జిల్లా



డీసీసీ అధ్యక్షులు చిగురింత పారిజాత నరసింహారెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాదర్గుల్ డివిజన్ అధ్యక్షులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, నవారు మల్లారెడ్డి, బోయపల్లి వెంకటరెడ్డి, యాదయ్య, శ్రీనివాస చారి, దిండు శ్రీనివాస్ గౌడ్, ఎదుళ్ల ప్రతాప్ రెడ్డి, లక్ష్మీ నరసింహారెడ్డి, ధన్సింగ్ నాయక్, గోలి రంజిత్ రెడ్డి, పృధ్వి రాథోడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ అధ్యక్షులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుతో జర్నలిస్టుల గౌరవం మరింత పెరిగింది

- పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గాండ్ల మోహన్

పెద్దపల్లి జిల్లా క్రైమ్ మిర్రర్ నవంబర్ 6: న్యూస్: జర్నలిస్టుల గౌరవం, హక్కులకు మరింత గుర్తింపు లభించేలా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గాండ్ల మోహన్ అన్నారు. ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాతోపాటు యూట్యూబ్ న్యూస్ ఛానళ్లలో పనిచేసే జర్నలిస్టుల పాత్రను గుర్తించడం మీడియా రంగానికి ప్రాధాన్యతనిచ్చినట్లేనని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకొస్తున్నారని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తున్నారని అన్నారు. సమాజంలో



జరుగుతున్న అవినీతి, అక్రమాలు, ప్రజా సమస్యలను వివిధ మాధ్యమాల ద్వారా బయటపెట్టడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం జర్నలిస్టులపై తప్పుడు కేసులు పెట్టే ప్రయత్నాలు చేయడం బాధాకరమని అన్నారు. ఇలాంటి చర్యలకు అడ్డుకట్ట పడేలా జర్నలిస్టులకు చట్టపరమైన రక్షణ, వృత్తిపరమైన స్వేచ్ఛ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా పాత్ర ఎంతో కీలకమని, ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకొస్తున్న జర్నలిస్టుల సేవలను సమాజం గుర్తించాలని గాండ్ల మోహన్ పేర్కొన్నారు.

బంగారం తాకట్టు పెట్టినా రైతులకు దక్కని పంటల ఫలితం

నర్సాపూర్ నియోజకవర్గంలో ఎండిన పంటలను పరిశీలించిన హరీశ్‌రావు

నీరు లేక 12 ఎకరాల వరి పంట ఎండిపోయింది!

రుణమాఫీ కాలేదు.. కొత్త పంట రుణం అందలేదు

అప్పులు చేసి సాగు చేసినా రైతుకు మిగిలింది నష్టమే

తక్షణమే పంట నష్టపరిహారం అందించాలని ప్రభుత్వానికి డిమాండ్

హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 06: రుణమాఫీ పూర్తికాక, కొత్తగా పంట రుణాలు అందక, సాగు పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి రైతులను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతోంది. భార్య బంగారాన్ని సైతం తాకట్టు పెట్టి అప్పు తెచ్చి ఎంతో ఆశతో సాగు చేసిన 12 ఎకరాల వరి పంట నీరు అందక ఎండిపోవడంతో ఓ రైతు కుటుంబానికి తీవ్ర నష్టం వాటిల్లింది. నర్సాపూర్ నియోజకవర్గంలోని హత్నూర మండలం లక్ష్మా తండాకు చెందిన నీలావత్ రమేష్ కుటుంబం ఎదుర్కొంటున్న ఈ పరిస్థితి రైతుల కష్టాలకు అద్దం పడుతోంది. పంట సాగు కోసం బ్యాంకుల నుంచి రుణాలు అందకపోవడంతో భార్య బంగారాన్ని తాకట్టు పెట్టి పెట్టుబడి సమకూర్చుకున్న రమేష్, కష్టపడి వరి పంట సాగు చేశారు. అయితే సరైన నీటి వసతి లేక సుమారు 12 ఎకరాల్లోని వరి పంట పూర్తిగా ఎండిపోవడంతో పెట్టిన పెట్టుబడి నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. నర్సాపూర్ నియోజకవర్గంలోని చిలిపిచెడ్ మండలం ఫైజాబాద్ గ్రామం, హత్నూర మండలం లక్ష్మా తండా, నస్తీపూర్ గ్రామాల్లో నీరు అందక ఎండిపోయిన వరి పంటలను మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పరిశీలించారు. పొలాల్లోకి వెళ్లి పంటల పరిస్థితిని స్వయంగా పరిశీలించడంతో పాటు నష్టపోయిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లక్ష్మా తండాకు చెందిన నీలావత్ రమేష్ కుటుంబం పరిస్థితిని తెలుసుకున్న నాయకులు రైతు కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. భార్య బంగారం తాకట్టు పెట్టి అప్పు తెచ్చి సాగు చేసిన పంట సైతం నీరు లేక ఎండిపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్నా ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందడం లేదని పేర్కొన్నారు. పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ నీటి కొరతతో పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం తక్షణమే పంట నష్టపరిహారం అందించాలని నాయకులు డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు. అప్పులు చేసి సాగు చేసిన రైతులు మరింత ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోకుండా ప్రభుత్వం వెంటనే స్పందించాలని అన్నారు. రైతులకు జరిగిన నష్టంపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, బాధిత రైతులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని హరీశ్‌రావు భరోసా ఇచ్చారు.





దాడి కేసులో నిందితుడికి ఏడాది కఠిన కారాగార శిక్ష

కర్రతో దాడి చేసి గాయపరిచిన కేసులో శిక్ష

ఐపీసీ, ఎస్సీ ఎస్టీ చట్టాల కింద న్యాయస్థానం తీర్పు

రూ.1,000 జరిమానా.. చెల్లించకపోతే అదనపు జైలు శిక్ష

తండ్రి హత్య కేసులో ఇప్పటికే యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న నిందితుడు

పోలీసుల దర్యాప్తును అభినందించిన ఎస్పీ పరితోష్ పంకజ్

తండ్రి హత్య కేసులో ఇప్పటికే యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న నిందితుడు

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 06: వ్యక్తిపై కర్రతో దాడి చేసి గాయపరిచిన కేసులో నిందితుడికి సంగారెడ్డి ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం ఏడాది కఠిన కారాగార శిక్ష విధించింది. కొండాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో నమోదైన ఈ కేసులో నేరం రుజువు కావడంతో న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. కొండాపూర్ పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 12/2021, సెషన్స్ కేసు నంబర్ 78/2021లో మునిదేవునిపల్లి గ్రామానికి చెందిన పద్మటి అశోక్ అలియాస్ మల్లారెడ్డి (30) బాధితుడిపై కర్రతో దాడి చేసి గాయపరిచినట్లు కేసు నమోదైంది. ఈ కేసును విచారించిన సంగారెడ్డి ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం కమ్ 3వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి డి. మాధవీకృష్ణ నిందితుడికి ఐపీసీ సెక్షన్ 324 కింద ఏడాది కఠిన కారాగార శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 3 నెలలు సాధారణ కారాగార శిక్ష అనుభవించాలని ఆదేశించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టంలోని సెక్షన్ 3(2)(ఝు) కింద మరో ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే మరో 3 నెలలు సాధారణ కారాగార శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. రెండు సెక్షన్ల కింద మొత్తం రూ.1,000 జరిమానా విధించారు. ఇదిలా ఉండగా, భూ వివాదం నేపథ్యంలో తన తండ్రి పద్మటి మాధవరెడ్డిని హత్య చేసిన మరో కేసులో ఇదే నిందితుడికి ఈ ఏడాది జూన్‌లో యావజ్జీవ కారాగార శిక్ష పడింది. ప్రస్తుతం అతడు జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి, నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ అభినందించారు.